తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
14-05-2024
మంగళవారం
మల్కాజిగిరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
సంపుటి : 01 | సంచిక : 266 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889



## తొందర్లోనే పెళ్లి చేసుకోవాలి

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత నేత రాహుల్ గాంధీ సోమవారం రాయ్‌బరేలీ నియోజకవర్గంలో జరిగిన బహిరంగ సభలో తన సోదరి ప్రియాంకా గాంధీతో కలిసి మీటింగ్‌లో పాల్గొన్నారు. అయితే సభకు వచ్చిన జనం ఓ ప్రశ్న వేశారు. దాని గురించి స్టేజ్ మీద ఉన్న ప్రియాంకా గాంధీ.. రాహుల్‌కు చెప్పింది. సభకు వచచిన జనానికి ముందు సమాధానం ఇవ్వాలని ఆమె కోరారు. అప్పటికే ప్రసంగాన్ని ముగించిన రాహుల్.. సోదరి ప్రియాంకా చెప్పిన విషయాన్ని గమనించి బదులిచ్చారు. జనం పెళ్లి గురించి అడుగుతున్నట్లు ప్రియాంకా చెప్పగానే.. మీరేమి అడగాలనుకుంటున్నట్లు రాహుల్ మైక్‌లో అడిగారు. ఆ తర్వాత చిరు నవ్వు చిందిస్తూ.. ప్రశ్న ఏంటో అడగండి అంటూనే ఆయన ఓ విషయాన్ని చెప్పారు. ఇక ఇప్పుడు తొందరల్లోనే చేసుకోవాల్సి ఉంటుందని పెళ్లి గురించి రాహుల్ కామెంట్ చేశారు. అబ్ జల్దీ కర్నీ పడేగి అంటూ వ్యాఖ్యానించారు. ఆ ఘటనకు చెందిన వీడియో ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నది.



# పాకిస్థాన్‌కి నేను గాజులు తొడుగుతా.. బిహార్ సభలో ప్రధాని మోదీ.. కామెంట్స్ వైరల్!

'పాకిస్థాన్‌కి నేను గాజులు తొడుగుతా..' అని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. విపక్ష ఇండియా కూటమి నేతలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు మోదీ. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారాల జోరును పెంచిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. పాకిస్థాన్ పై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. బిహార్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో.. 'నేను పాకిస్థాన్‌కి గాజులు తొడుగుతాను,' అని ఆయన అన్నారు.
లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. పాకిస్థాన్‌పై తీవ్ర విమర్శలు చేస్తూ వచ్చారు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. పీఓకే (పాక్ ఆక్రమిత కశ్మీర్)ని భారత్‌లో కలుపుకుంటామని అన్నారు. ఈ వ్యాఖ్యలపై నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా మండిపడ్డారు. 'పొరుగు దేశం గాజులు వేసుకుని కూర్చోలేదు. వాళ్ల దగ్గర ఆటమ్ బాంబ్ ఉంది. అది ఇండియాకు హాని చేయొచ్చు,' అన్నారు. ఇక బిహార్‌ల జరిగిన బహిరంగ సభలో..

...మిగతాది 2 లో



## బిజెపికి 195 సీట్లు కూడా రావు

దేశంలో నరేంద్ర మోడీ సారధ్యంలోని బిజెపి కూటమిని మట్టికరిపించి విపక్ష ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకొస్తామని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఇండియా కూటమి బీజేపీని నిలువరించేలా తాము బెంగాల్ నుంచే కూటమికి సాయం చేస్తామని చెప్పారు. తనకు అందిన సమాచారం ప్రకారం ఎన్డీయే కేవలం 190 నుంచి 195 స్థానాలకే పరిమితమవుతుందని, విపక్ష ఇండియా కూటమి 315 స్థానాల్లో గెలుపొందుతుందని అన్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లా బన్గావ్‌లో దీదీ లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మోదీ సర్కార్‌కు భంగపాటు తప్పదని ఆమె పేర్కొన్నారు. విపక్ష ఇండియా కూటమి కేంద్రంలో అధికార పగ్గాలు చేపడుతుందని దీదీ ఆశాభావం వ్యక్తం చేశారు.



## తన తల్లిపై ప్రజ్వల్ రేవణ్ణ అత్యాచారం

ప్రజ్వల్ రేవణ్ణ తన తల్లిపై నాలుగైదేళ్ల క్రితం బెంగళూరులోని నివాసంలో అత్యాచారానికి పాల్పడినట్లు ఓ మహిళ ఆరోపించింది. దీనికి సంబంధించి సిట్ అధికారుల ఎదుట వాంగ్మూలాన్ని ఇచ్చింది. అంతే కాకుండా ప్రజ్వల్ వీడియో కాల్‌లో బెదిరించి తన దుస్తులు విప్పించాడని తెలిపింది. "ఆయన మా అమ్మ ఫోన్‌కు కాల్ చేసి.. వీడియో కాల్‌లో మాట్లాడాలని నన్ను బలవంతం చేసేవాడు. నా దుస్తులు విప్పాలని అడిగేవాడు. నేను అందుకు నిరాకరిస్తే.. నాకు, మా అమ్మకు హాని తలపెడతానని బెదిరించేవాడు" అని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ప్రజ్వల్, హెచ్‌డీ రేవణ్ణ తన తల్లిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆమె తెలిపింది. తన తండ్రిని ఉద్యోగం నుంచి తొలగిస్తానని బెదిరించి తనపై, తన తల్లిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపించింది. తాము ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగానే.. తన తండ్రిని ఉద్యోగం నుంచి తొలగించారని పేర్కొంది. తన నివాసంలో పనిచేసే మహిళలను ప్రజ్వల్ వేధింపులకు గురిచేశాడని తెలిపింది. ప్రజ్వల్ బాధితుల్లో ఎంతో మంది మహిళలు ఉన్నారని.. కేవలం ముగ్గురు మాత్రమే వారి దారుణాలను బయటపెట్టారని చెప్పింది. ఈ ఘటన అనంతరం తమ భూమిని కూడా బలవంతంగా అమ్ముకోవాల్సి వచ్చిందని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకూ ప్రజ్వల్ రేవణ్ణ, ఆయన తండ్రిపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

4 లో

## వెంటాడుతున్న మేడిగడ్డ

# విజయం మాదే..!

### ఇండియా కూటమి తప్పకుండా విజయం సాధిస్తుంది ఓటు వేసిన సీఎం రేవంత్ రెడ్డి




**జయభేరి, కొడంగల్, మే 13 :**
తెలంగాణ వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. వికారాబాద్ జిల్లా కొడంగల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.
ఓటు వేసిన అనంతరం మీడియాతో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి తప్పకుండా విజయం సాధిస్తామిన సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బిజెపికి ఓటేసేందుకు ప్రజలు సిద్ధంగా లేరని.. దేశ వ్యాప్తంగా బిజెపి గ్రాఫ్ పడిపోతుందన్నారు.
బీజేపీతో వచ్చేది లేదు సచ్చేది లేదని విమర్శించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని తెలిపారు. ఎన్డీఏ కూటమి పత్తా లేకుండా పోతుందని.. ఆ పార్టీ మ్యాజిక్ ఫిగర్ కూడా రాదని చెప్పారు.ప్రజలంతా మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. మోడీ.. ఈడీ, సీబీఐను నమ్ముకున్నారని విమర్శించారు. మోడీ వెనక అవినీతిపరులు ఉన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే రాజ్యాంగం ఉంటుందని పంద్రాగస్టులోపు రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలకు, ప్రభుత్వానికి ఈ ఎన్నికలు రెఫరెండం అని తెలిపారు. అనంతరం గ్రామస్థులతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ పలు విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు.



## మహిళలు రెడ్ లిప్‌స్టిక్ వాడితే జైలుకే

ఉత్తర కొరియా దేశాధినేత కిమ్ జాంగ్ ఉన్ అమలు చేసే ప్రతి రూల్ చాలా వింతగా అనిపిస్తుంది. ఇప్పుడు ప్రజలపై కొత్త రకం నియమ నిబంధనలు విధిస్తారు. వాటిని పాటించలేక ప్రజలు నరకం అనుభవిస్తుంటారు. వేసుకునే దుస్తుల నుంచి హెయిర్ స్టైల్ వరకు ఈ దేశంలో అనేక కఠినమైన రూల్స్ అమల్లో ఉన్నాయి. ఇప్పటికే నార్త్ కొరియా అనేక పాపులర్ ఫ్యాషన్ బ్రాండ్లు, కాస్మెటిక్స్ ప్రొడక్ట్‌స్‌ను బ్యాన్ చేసింది. అలాగే మహిళలు రెడ్ కలర్ లిప్‌స్టిక్

...మిగతాది 2 లో



# పలు చోట్ల ఓట్ల బహిష్కరణ

**జయభేరి, హైదరాబాద్, మే 13 :**
తెలంగాణ వ్యాప్తంగా ప్రశాంతంగా పోలింగ్ కొనసాగుతోంది. ఆరు నెలల క్రితమే అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. అయినా ఓటర్లలో చైతన్యం ఏ మాత్రం తగ్గలేదు. అయితే సమస్య పేరుతో కొన్ని గ్రామాల ప్రజలు పోలింగ్‌ను బహిష్కరించారు. సమస్యల పరిష్కారం అయ్యే వరకు ఓటు వేసేది లేదని తేల్చి చెబుతున్నారు.

**ధాన్యం కొనలేదని**

భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం కనుముక్కలలో ప్రజలు ఓటింగ్‌ను బహిష్కరించారు. ఈ మధ్య కాలంలో కురిసిన వర్షాలకు తమ పంటలు పూర్తిగా పాడైపోయాయని వాటిని కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని చెబుతూ పోలింగ్‌ను బహిష్కరించారు. ముఖ్యంగా తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పోలింగ్ వరకు రైతుల సమస్యలపై మాట్లాడుతున్న నేతలు తర్వాత వారి సమస్యలను గాలికి వదిలేస్తున్నారని మండిపడ్డారు. విషయాన్ని తెలుసుకున్న అధికారులు గ్రామానికి వెళ్లి వారితో మాట్లాడారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని తేల్చి చెప్పారు. పోలింగ్ ముగిసిన

...మిగతాది 2 లో



## కూటమి గెలిస్తే జూన్ 5న బయటకు వస్తా

దేశంలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిస్తే.. జూన్ 5న తిహార్ జైలు నుంచి విడుదలవుతానని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ అమ్ ఆద్మీ పార్టీ కౌన్సిలర్లనుద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మద్యం పాలసీ కేసులో

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## పాకిస్థాన్‌కి నేను గాజులు తొడుగుతా..

ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యలపై పరోక్షంగా విమర్శలు చేశారు మోదీ. అదే సమయంలో పాకిస్థాన్ ఆర్థిక కష్టాలను లేవనెత్తారు. "పాకిస్థాన్ ఇంకా గాజులు వేసుకోకపోతే.. నేను గాజులు తొడుగుతాను. వాళ్ల దగ్గర విద్యుత్ లేదు. తిండి లేదు. వాళ్లకి ఇప్పుడు గాజుల కొరత కూడా ఉందని నాకు తెలిసింది," అని ముజాఫర్‌లో జరిగిన సభలో వ్యాఖ్యానించారు. మరోవైపు.. 'పాకిస్థాన్ దగ్గర ఆటమ్ బాంబు ఉంది. మనం ఆ దేశాన్ని గౌరవించండి,' అని కాంగ్రెస్ నేత మణి శంకర్ అయ్యర్ గతంలో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ఒకటి తాజాగా బయటకు వచ్చింది. దీనిపైనా మోదీ కొన్ని రోజుల క్రితం స్పందించారు. "దేశ ప్రజలను కాంగ్రెస్ నాశనం చేస్తోంది. లాంటి బలహీన మనస్థత్వం వల్లే సీమాంతర ఉగ్రవాదం గతంలో ఎక్కువగా ఉండేది. ఇక పాకిస్థాన్ విషయానికొస్తే.. తాము తయారు చేసిన బాంబులను అమ్మడానికి ఆ దేశం చాలా ప్రయత్నిస్తోంది. కానీ నాణ్యత సరిగ్గా లేకపోవడంతో కొనేవారే లేరు!" అని మోదీ అన్నారు. విపక్ష ఇండియా కూటమిపైనా విరుచుకుపడ్డారు మోదీ.

"బిహార్ ప్రజల కన్నా.. ఆర్‌జేడీ కాంగ్రెస్‌కి ఓటు బ్యాంకు సంక్షేమమే ముఖ్యం. రాష్ట్రంలో అరాచక పాలన కోసం ఆర్‌జేడీ ప్రయత్నిస్తోంది," అని మోదీ అన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న లాలూ ప్రసాద్ యాదవ్ మాటలను తిప్పికొడుతూ.. 'దళితుల రిజర్వేషన్లను దోచుకోవడానికి ఆర్‌జేడీ, కాంగ్రెస్ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి' అని మోదీ అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల 4వ దశ పోలింగ్ ప్రస్తుతం నడుస్తోంది. మొత్తం 7 దశలో పోలింగ్ తర్వాత.. జూన్ 4న ఫలితాలు వెలువడతాయి. మూడోసారి అధికారం కోసం బీజేపీ ప్రయత్నిస్తుండగా.. మోదీని గద్దెదించడమే లక్ష్యంగా కాంగ్రెస్, ఇండియా కూటమి కృషి చేస్తోంది.

## పలు చోట్ల ఓట్ల బహిష్కరణ

తర్వాత ఉన్నతాధికారులతో మాట్లాడి కచ్చితంగా సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

**కరెంటు లేదని**

కొడంగల్‌లోని ఓ పల్లెలో మూడు రోజులుగా పవర్ లేదని ప్రజల పోలింగ్ బహిష్కరించారు. ఊరిలోని ఏ ఒక్కరు కూడా ఓటు వేసేందుకు రాలేదు. మూడు రోజులుగా కరెంటు లేక ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు గ్రామస్థులు. అధికారులు విషయాన్ని తెలుసుకొని వారితో చర్చలు జరిపారు. ఖమ్మం జిల్లా రాయమాదారంలో ప్రజలు కూడా వంతెన కోసం పోలింగ్‌ను బహిష్కరించారు. ఎన్‌ఎస్పీ కాలువపై ఎప్పటి నుంచో వంతెన ఏర్పాటు చేయమంటే ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లా అల్లంపల్లిలో కూడా రోడ్డు సరిగా లేదని ప్రజలు పోలింగ్‌ను బహిష్కరించారు. ఎప్పటి నుంచో ఉన్న రోడ్డు సమస్య తీర్చే వరకు ఓటు వేసేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా మైలారంలో కూడా ప్రజలు పోలింగ్‌ను బాయ్‌కాట్ చేశారు. స్థానికంగా జరుగుతున్న మైనింగ్‌తో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ఆరోపించారు. వాటిని ఆపేంత వరకు ఓటు వేయబోమన్నారు. వారికి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగి మృతి చెందాడు. అశ్వారావుపేటలోని నెహ్రూనగర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఈ దుర్ఘటన జరిగింది. అక్కడ పని చేస్తున్న శ్రీ కృష్ణ అనే ఉద్యోగి ఒక్కసారిగా గుండెపోటుతో పడిపోయాడు. ఆయనకు సీపీఆర్ చేసిన ప్రయోజనం లేకపోయింది. ఆయన చుంచుపల్లిలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.

**ప్రశాంతంగా పోలింగ్: వికాస్ రాజ్**

తెలంగాణలో ప్రశాంతంగా పోలింగ్ సాగుతోందని ఎన్నికల ప్రధాన అధికారులు వికాస్ రాజ్ చెప్పారు. విద్యుత్ అంతరాయం కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఆలస్యంగా పోలింగ్ మొదలైందని పేర్కొన్నారు. బస్‌లు, వెహికల్స్ వెళ్లలేని ప్రాంతాలకు ఎద్దుల బండిలో ఈవీఎంలు తరలించి పోలింగ్ నిర్వహించామన్నారు. హైదరాబాద్‌లోని ఎస్‌ఆర్‌నగర్‌లోని ఓ పోలింగ్ స్టేషన్‌లో వికాస్‌రాజ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## రెడ్ లిప్‌స్టిక్ వాడితే జైలుకే

వాడకుండా నిషేధం విధించింది. సాధారణంగా ఎర్రటి పెదవులతో అందంగా కనిపించాలని మగువలకు ఉంటుంది. కానీ ఉత్తర కొరియా మహిళలకు ఆ కల కలగానే మిగిలిపోతుంది. ఈ నియమాన్ని బ్రేక్ చేస్తే కిమ్ విధించే దారుణమైన శిక్షలకు బలి కావాల్సిందే.

ఉత్తర కొరియా డిక్టేటర్ కిమ్ జోంగ్ ఉన్ రెడ్ లిప్‌స్టిక్ మంచిది కాదని భావిస్తారు. అందుకే ఆ దేశంలో దాన్ని బ్యాన్ చేశారు. రెడ్ కలర్ స్వేచ్ఛను సూచిస్తుందని, రెడ్ లిప్‌స్టిక్ వాడే మహిళలు చాలా అందంగా కనిపిస్తారనేది కిమ్ అభిప్రాయం. అయితే స్వేచ్ఛ, మహిళల టెంప్టేషన్ రెండూ దేశానికి మంచివి కావని భావించిన కిమ్, ఎరుపు రంగు లిప్‌స్టిక్‌ను తమ దేశంలో బ్యాన్ చేశారు. సంప్రదాయ, నైతిక విలువలను కాపాడటానికి ఈ నిషేధం అవసరం అని ఆ దేశం నమ్ముతోంది. మహిళలు పొరపాటున రెడ్ లిప్‌స్టిక్ అప్లై చేసుకుంటే కఠినమైన శిక్షలు, భారీ పెనాల్టీలు విధిస్తారు.

**రూల్స్ బ్రేక్ చేస్తే?**

ఉత్తర కొరియా మహిళలు చాలా సింపుల్ మేకప్ మాత్రమే వేసుకునే అవకాశం ఉంది. ఈ దేశం మిగతా ప్రపంచంతో సంబంధం లేకుండా ప్రజల వస్త్రధారణ, ప్రవర్తనలపై ఇప్పటికీ పాత కాలపు ఆలోచనలను ఫాలో అవుతోంది. అక్కడి ప్రభుత్వం మహిళల మేకప్ చెక్ చేయడానికి ప్రత్యేకంగా వర్కర్స్‌ను నియమించింది. ప్రతి ఒక్కరూ ఫ్యాషన్ రూల్స్ పాటించేలా చూడటం వీరి బాధ్యత. ఎవరైనా ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే పెద్ద ఇబ్బందుల్లో పడతారు. ప్రభుత్వం ప్రతి సిటిజన్ బాధ్యతగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఇతర దేశాల ఫ్యాషన్ స్టైల్స్ వల్ల దేశ ప్రజలు ఇన్‌ఫ్లుయెన్స్ కాకుండా జాగ్రత్త పడుతుంది.

ఉత్తర కొరియాలో హెయిర్ స్టైల్స్‌పై కూడా కఠినమైన నియమాలు ఉన్నాయి. మహిళలకు పొడవాటి జుట్టు ఉండకూడదు లేదా డిఫరెంట్ స్టైల్స్ ఎంచుకోకూడదు. షార్ట్ హెయిర్‌తో మాత్రమే ఉండాలి. జుట్టును శుభ్రంగా, చక్కగా మెయింటెన్ చేయాలి. హెయిర్ కలర్స్ వేసుకోవడం కూడా ఇక్కడ ఒక పెద్ద నేరం. కిమ్ కొన్ని హెయిర్ స్టైల్స్‌కు మాత్రమే ఓకే చెప్పారు. పురుషులు 10, మహిళలు 18 హెయిర్ స్టైల్స్‌లో నచ్చిన దాన్ని ఎంచుకోవచ్చని కిమ్ ప్రకటించారు. ప్రజలు తప్పనిసరిగా ఈ హెయిర్ రూల్స్ పాటించాలి. లేదంటే శిక్ష అనుభవించక తప్పదు.

## కూటమి గెలిస్తే బయటకు వస్తా



అరెస్టయిన అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. మళ్లీ జూన్ 2న లొంగిపోవాలని సూచించిన విషయం తెలిసిందే. ఆయన మాట్లాడుతూ 'తిహార్‌లోని తన సెల్‌లో రెండు సీసీటీవీ కెమెరాలు ఉన్నాయి. ఫీడ్‌ను 13 మంది అధికారులు పర్యవేక్షించారు. సీసీటీవీ ఫీడ్‌ను పీఎంవోకు సైతం అందించారు. మోదీ సైతం పర్యవేక్షిస్తున్నారు. మోదీకి తనపై ఎలాంటి పగ ఉందో నాకు తెలియదు. బాత్‌రూమ్‌కి వెళ్లడానికి నేను రాత్రి ఏ సమయానికి లేస్తానో కూడా వారు పర్యవేక్షించే వారు' అన్నారు. కేజ్రీవాల్ డిప్రెషన్‌లో లేరని.. తనకు హనుమంతుడి ఆశీస్సులు ఉన్నాయని వారికి చెప్పాలనుకుంటున్నానన్నారు. తాను జూన్ 2న తిహార్ జైలుకు వెళ్లినప్పటికీ.. జూన్ 4న జైలులోనే ఫలితాలను చూస్తానన్నారు. ఇండియా కూటమి గెలిస్తేనే జూన్ 5న మళ్లీ బయటకు వస్తానన్నారు. మనం ఇప్పుడు కష్టపడకపోతే మళ్లీ ఎప్పుడు కలుస్తామో తెలియదన్నారు.

# కేజ్రీ 'వాల్ ' అవుతారా?

**సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. మాములుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసుల్లో బెయిల్ దొరకడం అనేది అసాధ్యం.. కానీ కేజ్రీవాల్ కేసును స్పెషల్‌గా తీసుకొని మరీ బెయిల్ ఇచ్చింది అత్యున్నత న్యాయస్థానం.. జూన్ 1 వరకు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. దీంతో తీహార్ నుంచి రిలీజ్ అయ్యారు కేజ్రీవాల్.. జైలుకు వెళ్లడానికి ముందే బీజేపీపై కత్తులు నూరారు కేజ్రీవాల్.. తనపై తప్పుడు కేసు నమోదు చేసి జైలుకు పంపారన్న కోపం పీక్స్‌లో ఉంది ఆయనకు.. అలాంటి కేజ్రీవాల్‌కు మళ్లీ బయటికి వచ్చి ఎన్నికల ప్రచారంలో పాల్గొనే చాన్స్ వచ్చింది. దీంతో ఇప్పుడు దేశ రాజకీయాల్లో మరింత స్పైస్ యాడ్ కానుంది.**

**జయభేరి, న్యూఢిల్లీ, మే 13:**



ఇక ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కాంలో అరెస్ట్ అయ్యి, మధ్యంతర బెయిల్‌పై తీహార్ జైలు నుంచి విడుదలైన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. తాజాగా ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అమలు చేసే 10 గ్యారంటీలను ప్రకటించారు కేజ్రీవాల్. ఆదివారం ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆప్ జాతీయ కన్వీనర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 24 గంటల విద్యుత్, ఉచిత విద్య , ఢిల్లీకి పూర్తి రాష్ట్ర హోదాతో సహా పలు హామీలను ఇచ్చారు. భారత సరిహద్దు వెంబడి చైనా ఆక్రమించుకున్న భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు. తాను జైలులో ఉన్నందున ఈ పది హామీల ప్రకటన ఆలస్యమైందని కేజ్రీవాల్ అన్నారు. దేశంలో ఇంకా ఎన్నికలు మిగిలి ఉన్నాయన్నారు. ఈ హామీలపై తాను ఇతర ఇండియా కూటమి భాగస్వాములతో చర్చించలేదని.., అయితే ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉండదని కేజ్రీవాల్ అన్నారు.ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ హామీలు అమలయ్యేలా చూస్తానని హామీ ఇస్తున్నానని కేజ్రీవాల్ అన్నారు.ముందుగా రాబోయే ఎన్నికల్లో కేజ్రీవాల్ ఎఫెక్ట్ ఏ మేరకు ఉంటుందో చూద్దాం..మాములుగా కేజ్రీవాల్ ఎఫెక్ట్ ఉన్న రాష్ట్రాల లిస్ట్‌లో ఫస్ట్ ప్లేస్‌లో ఉండేది ఢిల్లీ.. ఆ తర్వా పంజాబ్, హర్యాణా... ఇక రాజస్థాన్, గోవాలో ఉన్నా.. అది చాలా తక్కువ.. సో మూడు రాష్ట్రాల్లో కేజ్రీవాల్ ఎఫెక్ట్ ఎక్కువే అని చెప్పాలి. ఇప్పటికే ఈ మూడు రాష్ట్రాల్లో ఆప్ జోరుగా ప్రచారం చేస్తుంది. ఇప్పుడా జోరు మరింత పెరగనుంది. ఢిల్లీలో కాంగ్రెస్‌తో ఆమ్ ఆద్మీ పార్టీ పొత్తు పెట్టుకుంది. ఇండియా కూటమిలో భాగంగా దేశ రాజధానిలోని ఏడు సీట్లలో ఆప్ నాలుగు.. మిగిలిన మూడు సీట్లలో కాంగ్రెస్ నుంచి అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన రాజధానిపై ఫుల్ ఫోకస్ పెట్టనున్నారునెక్స్ట్ పంజాబ్.. ఇక్కడ 13 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. ఇక హర్యాణాలో ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉంది. బట్ ఇప్పుడు కేజ్రీవాల్ ఎంట్రీతో ప్రచార స్టైల్ మారనుంది. అసలు కేజ్రీవాల్‌కు బెయిల్ వచ్చిన టైమింగ్ హైలేట్ అని చెప్పాలి. ఎందుకంటే ఆప్‌కు చివరి మూడు దశల పోలింగ్ చాలా ముఖ్యం.. మే 20, 25, జూన్ 1 వీటి పోలింగ్ ఉంది. ఢిల్లీ, హర్యానాల్లో ఆరో దశలో మే 25న.. ఆ తర్వాత పంజాబ్‌లో జూన్ 1న పోలింగ్ జరగనుంది. జూన్ 2న ఆయన తిరిగి తీహార్‌కు వెళ్లనున్నారు. సో పర్ఫెక్ట్ టైమ్‌లో బెయిల్ వచ్చింది కేజ్రీవాల్‌కు..కేజ్రివాల్ ఇక స్టేజ్ ఎక్కినా.. రోడ్ షో నిర్వహించినా.. దాని ఇంపాక్ట్ అంతా ఇంతా ఉండదు. ఇకపై అటు మోడీని ఇటు బీజేపీని చీల్చి చెండాడటం ఖాయం. ఇప్పటికే ఆయన ఈ పనిని మొదలు పెట్టారు. మరి ఈ పరిణామాలను ఎదుర్కోనేందుకు బీజేపీ ప్రిపేర్డ్‌గా లేదా? అంటే ఉందనే చెప్పాలి.. ఎందుకంటే.. జైలు నుంచి కేజ్రివాల్ బయటకు వస్తే ఆయనే సెంటరాఫ్ అట్రాక్షన్ అవుతారని బీజేపీకి కూడా తెలుసు. ఇప్పుడు బీజేపీకి ఒక్కటే చాయిస్ ఉంది. అది కేజ్రీవాల్ ఎదుర్కొంటున్న అవినీతి ఆరోపణలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం.. ఎట్ ది సేమ్ టైమ్.. ఆయన జైలు నుంచి వచ్చాడు.. మళ్లీ జూన్ 2న లొంగిపోవాలని సుప్రీం ఇచ్చిన ఆదేశాలను గుర్తు చేయడం.. బీజేపీ ఇదే టాపిక్‌పై ప్రచారం చేయనుంది.బట్ బీజేపీ ఈ స్ట్రాటజీని కేజ్రీవాల్ ఈజీగా ఓవర్‌కమ్ చేస్తారనిపిస్తోంది. ఎందుకంటే ఆయన ఓ మంచి వక్త.. ఆయన ప్రచార స్టైల్ విద్య, ఉద్యోగం అన్నట్టుగా ఉంటుంది. నేను సామాన్యుడిని.. సామాన్యుల కోసమే పని చేస్తా అన్నట్టుగా సాగుతుంది ఆయన ప్రచారం. రియాల్టీ ఎలా ఉన్నా.. ఈ మధ్య ఎన్నికల ప్రచారంలో ఇదే ట్రెండ్.. దీనికి ప్రజలు ఈజీగా కనెక్ట్ అయ్యే చాన్స్ ఉంది. అంతేకాదు.. ఈ ఎన్నికలను కేజ్రీవాల్ ఓ రెఫరెండంగా భావించే చాన్స్ ఉంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొని తీహార్ జైల్లో ఉన్నా కూడా.. ప్రజలు తనను ఓ వారియర్‌గా భావిస్తారన్న ఆశలో ఉన్నారు కేజ్రీవాల్.. అయితే దీనికి ఆన్సర్ అంత వెంటనే చెప్పలేము.. జూన్ 4 వరకు ఆగాల్సిందే..

# అదే విధానం.. మారని కేసీఆర్

**జయభేరి, హైదరాబాద్, మే 13:**



కేసీఆర్.. ప్రశ్నించారు.. నిలదీశారు. కేసీఆర్.. ఎవరెన్ని సీట్లలో గెలుస్తారో క్లారిటీ ఇస్తూ జోస్యం చెప్పారు. కేసీఆర్.. ఇంకా చాలా మాట్లాడారు? ఓ రకంగా చెప్పాలంటే తనదైన స్టైల్‌లో రెచ్చిపోయారు. సరే ఇవన్నీ పొలిటికల్ స్టేట్‌మెంట్స్.. కాని ఓ విషయంపై మాత్రం క్లారిటీ ఇచ్చారు. ఆయనిచ్చిన క్లారిటీ ఇప్పుడు చాలా క్వశ్చన్స్‌ను మరోసారి రేయిజ్ చేసింది. ఇంతకీ కేసీఆర్ ఏమన్నారో వినండి.. సిటీలో చాలా మంది డీసీపీలు వస్తుంటారు.. పోతుంటారు. బట్ సీఎం లోకల్.. అన్నట్టుగా ఉంది కదా కేసీఆర్ గారు చెప్పిన డైలాగ్..కేసీఆర్ చెప్పిన డైలాగ్‌లో హైలేట్ పార్ట్ ఏంటంటే.. ఇది ఫస్ట్ ఆశ్చర్యంగా.. ఆ తర్వాత షాకింగ్‌గా.. అంతకుమించి ఫన్నీగా అనిపించింది. రాధాకిషన్ రావు ఎవరో సీఎంగా పనిచేసిన కేసీఆర్‌కు తెలియదంటా? ఇదేలా సాధ్యం? అస్సలు అంతుపట్టని క్వశ్చన్ ఇది. ప్రశ్న అడిగిన జర్నలిస్ట్‌నే రివర్స్‌లో ప్రశ్నించారు కేసీఆర్.. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరుక్కున్న రాధాకిషన్ రావు ఎవరో నిజంగా కేసీఆర్ తెలియదా? మరి తెలియకుండానే రిటైర్ అయిన రాధాకిషన్ రావును ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా నియమించారా?తెలియకపోతే టాస్క్‌ఫోర్స్‌లో కీలక బాధ్యతలను ఎందుకు అప్పగించారు? ఇదంతా సీఎం హోదాలో ఉన్న మీకు తెలియకుండానే జరిగిందా? మరి ఈ ప్రశ్నలకు కేసీఆరే సమాధానం చెప్పాలి. కానీ ఆయన మాత్రం వీటిపై నోరు మెదపరు. పోనీ ఎవరైనా ప్రశ్నిస్తే ఇలా రివర్స్‌లో దాడి మొదలు పెడతారు. ఒక్కసారి రాధాకిషన్ రావు కన్‌ఫెషన్ స్టేట్‌మెంట్‌ను చూద్దాం.. అందులో ఆయన క్లియర్‌కట్‌గా చెప్పారు. క్యాస్ట్ ఈక్వేషన్స్ అనుగుణంగానే తన సెలక్షన్ జరిగింది. నన్ను సెలెక్ట్ చేసిన తర్వాత SIB చీఫ్‌గా ఉన్న ప్రభాకర్ రావు కూడా తనను సెలెక్ట్ చేసేందుకు అంగీకరించారు. బీఆర్ఎస్ సుప్రీమోకు తెలిసే ఇదంతా జరిగింది. ఇదీ ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో చెప్పిన అంశాలు. మరి ఎవరి మాటలు నమ్మాలి? కేసీఆర్ మాటలు నమ్మాలా? రాధాకిషన్‌రావు మాటలు నమ్మాలా?సమాధానం చెప్పలేదు.. సరే.. కానీ ఆ తర్వాత కూడా ఆయన ఫోన్ ట్యాపింగ్ కేసుపై మాట్లాడారు. అది మరో హైలేట్.. ఇది దబాయింపుతో కూడిన అంగీకారంలా కనిపిస్తుంది. ఎందుకంటే ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ట్యాపింగ్ చేయడం లేదా? అని ప్రశ్నిస్తున్నారు కేసీఆర్.. అంటే అప్పుడు మీరు చేశారని చెప్పకనే చెబుతున్నట్టు ఉంది ఆయన స్టేట్‌మెంట్.. అంతేకాదు దీన్ని నమ్మేలా మరో స్టేట్‌మెంట్ కూడా ఇచ్చారు కేసీఆర్. హోంసెక్రటరీ పర్మిషన్ తీసుకొని పోలీసులు ఫోన్ ట్యాపింగ్ చేస్తారు. చేసిన తర్వాత దానిని డిమాలిష్ చేసే హక్కు కూడా పోలీసులకు ఉంది.ఇది టెలిగ్రాఫ్ యాక్ట్‌లోనే ఉంది. ఇవన్నీ కేసీఆర్ స్టేట్‌మెంట్సే.. కేసీఆర్ మాట్లాడిన మాటలన్ని ఒక ఆర్డర్‌లో చూద్దాం.. ఫస్ట్ రాధాకిషన్‌రావు ఎవరు? అన్నారు. తర్వాత ఫోన్ ట్యాపింగ్‌కు నాకు ఏంటి సంబంధ అన్నారు. ఆ తర్వాత పోలీసులకు ఫోన్ ట్యాపింగ్ చేసే రైట్ ఉంది అంటున్నారు. అంటే ఫోన్ ట్యాపింగ్ చేశారేమో అంటూనే.. చేసే హక్కు ఉంది అంటున్నారు కేసీఆర్.. కేసీఆర్ నిజంగా కన్‌ఫ్యూజ్ అవుతున్నారా? లేక ప్రజలను కావాలని కన్‌ఫ్యూజ్ చేస్తున్నారా? అనేది అర్థం కావడం లేదు. మాములుగా క్లారిటీ ఇవ్వనప్పుడు రాజకీయ నేతలు చేసే పని మరింత కన్‌ఫ్యూజ్ చేయడం.. కేసీఆర్ ఈ థియరీని ఫాలో అవ్వడమే కాదు.. ఇంప్లిమెంట్ చేస్తున్నట్టు కనిపిస్తోంది. ప్రస్తుతం ఎన్నికల టైమ్ కాబట్టి.. ఫోన్ ట్యాపింగ్ కేసు ఎక్కువగా చర్చకు రావడం లేదు. వన్స్ ఎలక్షన్స్ ముగిసిన తర్వాత ఈ పంచాయితీ మరింత పీక్స్‌కు చేరడం ఖాయంగా కనిపిస్తోంది. మరి కేసీఆర్ ఇప్పుడు మాట్లాడిన మాటలనైనా గుర్తు పెట్టుకుంటారా? మళ్లీ తర్వాత నేనెప్పుడు అన్నాను అంటారా? అనేది చూడాలి.

# వెంటాడుతున్న మేడిగడ్డ



✍ జయభేరి, హైదరాబాద్, మే 13:

కాళేశ్వరం ప్రాజెక్టు.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తానే ఓ భగీరథుడిని అని చెప్పుకొని మరీ నిర్మించిన ప్రాజెక్టు.. బట్ ఇప్పుడా ప్రాజెక్ట్ పనికి రాకుండా పోయింది. ఇప్పుడు అక్కడ కనిపించేవి కుంగిన పిల్లర్లు.. బీటలు వారిన గోడలు.. అక్కడ కుంగింది రైతుల ఆశలు, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కూడా.. ఇప్పుడా లిస్ట్‌లో చేరింది ఎల్ అండ్ టీ కంపెనీ కూడా.. అదేంటి కంపెనీకి ఏమైంది? చేసిన పనికి డబ్బు తీసుకున్నారు కదా.. అంటారా..? కాదు..వారికి కూడా డ్యామేజ్ జరిగిందిలార్సెన్ అండ్ టూబ్రో.. షార్ట్‌గా ఎల్ అండ్ టీ.. దేశవ్యాప్తంగానే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా చాలా ప్రస్టేజీయస్ ప్రాజెక్టులు చేపట్టిన కంపెనీ.. దేశంలో ఎన్నో డ్యామ్‌లతో పాటు రోడ్లు, భవనాలు నిర్మించిన కంపెనీ ఎల్ అండ్ టీ.. ఈ ఏడాది మార్చితో ముగిసిన క్వార్టర్‌లో కూడా 4 వేల 396 కోట్ల నికర లాభాలను సాధించింది ఈ కంపెనీ.. గతేడాది మార్చి క్వార్టర్‌తో పోలిస్తే ఇది 10 శాతం ఎక్కువ.. బట్ ఇప్పుడా కంపెనీ ఓ రాష్ట్ర ప్రభుత్వానికి సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. కారణం కాళేశ్వరం ప్రాజెక్ట్..కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌కు ఓ లెటర్ వచ్చింది. అది ఉత్తరాఖండ్ ప్రాజెక్టుల అభివృద్ధి సంస్థ రాసిన లెటర్.. అందులో సూటిగా ఓ ప్రశ్న ఉంది. అదేంటంటే మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి కారణం ఎవరు? ఈ వివరాలను వీలైనంత త్వరగా తెలపగలరు. ఇది ఆ లెటర్ సారాంశం.. అదేంటి ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు ఏంటి లింక్ అనే కదా మీ డౌట్.. ఉంది.ఉత్తరాఖండ్‌లో గౌలా నదిపై జమ్రాని డ్యాం నిర్మించాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం ఫిబ్రవరి 26న టెండర్ పిలిచింది. ఇందులో 150.6 మీటర్ల ఎత్తుతో కాంక్రీటు గ్రావిటీ డ్యాం నిర్మాణతో పాటు.. ఇతర అనుబంధ పనులకు L&T టెండరు వేసింది. ఇక్కడి వరకు బాగానే ఉంది.. అయితే తాము ఇప్పటి వరకు చేపట్టిన ప్రాజెక్టులలో ఎలాంటి వైఫల్యాలు లేవని.. ఇది మా స్టాండర్డ్స్‌కు ఎగ్జాంపుల్ అని చెప్పింది L&T.. అంతేకాదు ఈ అఫిడవిట్‌తో పాటు మేడిగడ్డ బ్యారేజికి సంబంధించిన వివరాలను కూడా సమర్పించింది. ఎవరైనా చెప్పిందల్లా నమ్మేయరు కదా.. అది కూడా కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి.. ఎందుకంటే ప్రాజెక్ట్ ఘన కీర్తి గురించి ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రచారం జరిగింది. సో ఉత్తరాఖండ్ ప్రభుత్వం వెంటనే అలర్టైంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు లెటర్ రాసింది. మేడిగడ్డ ప్రాజెక్ట్‌ను నిర్మించింది L&T అని న్యూస్‌లో చూశాం.. మరి ప్రాజెక్టు కుంగడానికి L&T కారణమా? అని ప్రశ్నించింది.క్వశ్చన్ సింపుల్‌గానే ఉంది.. కానీ దానికి ఆన్సర్ చెప్పడమే ఇప్పుడు కాస్త కంగారుగా ఉంది. ఎందుకంటే ఈ ప్రాజెక్టు వైఫల్యానికి కారణం ఎల్ అండ్ టీనా? లేక కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీర్లా? అని తేల్చాల్సిన పని తెలంగాణ నీటి పారుదల శాఖపై పడింది. అదొక్కటే కాదు.. ఉత్తరాఖండ్ ప్రభుత్వం మరిన్ని ప్రశ్నలు కూడా సంధించింది. మేడిగడ్డ నిర్మాణానికి బాధ్యులైన కాంట్రాక్టు సంస్థ ఎవరు? సంయుక్త భాగస్వామ్యం అయితే ఎవరి వాటా ఎంత? బ్యారేజీ ప్రధాన స్ట్రక్చర్‌లో వైఫల్యం జరిగిందా? ఈ ఘటన నిర్మాణం సమయంలోనా లేక డిఫెక్ట్ లయబులిటీ పిరియడ్‌లోనా? లేక ఆ తర్వాత జరిగిందా? ఈ వైఫల్యం విపత్తు వల్ల జరిగిందా? లేదా? అనేది కూడా నిర్ధారించాలని కోరింది ఉత్తరాఖండ్ ప్రభుత్వం..అయితే ఇక్కడో ట్విస్ట్ ఉంది.

అదేంటంటే.. ఇటీవలే కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్.. ప్రభుత్వానికి ఓ లెటర్ రాశారు. అందులో మేడిగడ్డ బ్యారేజీ పని పూర్తయినట్లు పొరపాటున పేర్కొన్నాము. ఈ తప్పును క్షమించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కోరారు. దీంతోపాటు దెబ్బతిన్న బ్యారేజీని సొంత ఖర్చుతో బాగు చేయాల్సిన బాధ్యత.. ఏజెన్సీదేనని, లేకుంటే చర్యలు తీసుకోవడంతోపాటు జరిగిన నష్టాన్ని.. ఆ సంస్థ నుంచి వసూలు చేయాలని ఆ లేఖలో కోరారు ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్. అంటే ఇక్కడ L&T బాధ్యత వహించే అవకాశం కనిపిస్తోంది.సో ఇప్పుడు తెలంగాణ నీటి పారుదలశాఖ ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి ఎలాంటి ఆన్సర్ ఇస్తుంది అనేది కాస్త ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఆ సమాధానంపైనే L&T టెండర్ ఆధారపడి ఉన్నట్టు కనిపిస్తోంది. నిజానికి ఎంతో చరిత్ర ఉన్న L&T చరిత్రలో ఓ మాయని మచ్చగా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిలిచినట్టు కనిపిస్తోంది. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగడంతోనే కదా.. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆ కంపెనీ సామర్థ్యంపై అనుమానాలు పెరిగింది? అందుకే కదా ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం కంపెనీ మాటలను నమ్మకుండా.. తెలంగాణను వివరణ కోరింది. ఇటు బీఆర్ఎస్‌కే కాదు.. L&Tకి కూడా కాళేశ్వరం ప్రాజెక్టు భస్మాసుర హస్తంగా మారినట్టు కనిపిస్తోంది పరిస్థితి.



# ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే దంపతులు

✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మండలం ముదిగొండ గ్రామపంచాయతీలో ఓటు హక్కును వినియోగించుకున్న దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ దంపతులు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లోచన్ సింగ్ జీవన్ రెడ్డి నర్రా భానుచందర్ మాజీ ఎంపిటిసి బిక్కు నాయక్ కోటి నరియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.


# ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే

✍ జయభేరి, దేవరకొండ :

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వారి స్వగ్రామం శేరిపల్లి(రత్య తండాలో) కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ వీరి వెంట కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు BRS నాయకులు తదితరులు ఉన్నారు.



# మిస్ ఫైర్ అయిన యూటీ



✍ జయభేరి, హైదరాబాద్, మే 13:

జూన్ 2న తెలంగాణ ఏర్పడింది. ఆ సమయంలో పదేళ్ల పాటు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా ప్రకటించారు. వచ్చే జూన్ 2 నాటికి ఈ గడువు తీరిపోనుంది. ఆ వెంటనే మన బంగారు భాగ్యనగరాన్ని.. కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని బీజేపీ కుట్రచేస్తోంది' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఆ వెంటనే గులాబీ నేత హరీష్ రావు మీడియా ముందుకు వచ్చి, హైదరాబాద్‌ను మరికొన్నేళ్లు ఉమ్మడి రాజధానిగా చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు' అంటూ ఆరోపించారు అయితే, ఆ వెంటనే బీజేపీ వీటిని ఖండించింది. తమకు ఎలాంటి రహస్య ఎజండాలూ లేవని, లోక్‌సభ ఎన్నికల్లో ఉనికిని చాటటానికే కేటీఆర్ అతితెలివి ప్రదర్శిస్తున్నారని మండిపడింది. ఇటు కాంగ్రెస్ నేతలూ దీనిపై స్పందించారు. కేంద్రం అలాంటి ప్రయత్నాలు చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇక దీనిపై మేధావులు, సామాజిక వేత్తలూ తమతమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. వీరిలో మెజారిటీ వ్యక్తులు దీనిని ఎన్నికల ఎత్తుగడగానే కొట్టిపారేశారు. పార్టీ ఇబ్బందుల్లో ఉన్న కాలంలో ఇలాంటి ఊహాజనిత అంశాలను తెరమీదకు తీసుకొచ్చి ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టటం గులాబీ పార్టీ పెద్దలకు అలవాటుగా మారిందని చెప్పుకొచ్చారు. దీనికి ఇటీవలి పరిణామాలే కారణమని వారు చెబుతున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి తాను లేకపోతే తెలంగాణ అనే కల సాకారమయ్యేదే కాదని, ఈ క్రెడిట్ అంతా తనదేనని గులాబీ బాస్ భావిస్తూ వచ్చారు. తెలంగాణను ఏలటం తనకు తప్ప మరొకరికి సాధ్యం కాదని, యావత్ తెలంగాణ ప్రజలను తన కంటిసైగతో శాసించగలననే భ్రమలో బతుకుతూ వచ్చారు. తన తర్వాత తన కుమారుడు దీనికి పాలకుడవుతాడని నమ్ముతూ వచ్చారు. అయితే, గత అసెంబ్లీ ఎన్నికల్లో బొక్కబోర్లా పడిన బీఆర్ఎస్ పార్టీకి ఓటమి తర్వాత గానీ రియాలిటీ ఏంటో అర్థం కాలేదు. నెల తిరగక ముందే నిన్నటిదాకా తన దగ్గర చేతులు కట్టుకుని నిలబడిన నేతలంతా కాంగ్రెస్ పార్టీలో చేరి, తన ముచ్చట్లన్నీ బయట పెట్టటంతో కేసీఆర్ షాక్‌కు గురయ్యారు. పులిమీద పుట్రలా ఈడీ వచ్చి కూతురు కవితను అరెస్టు చేసి తీహార్ జైలుకు తరలించటం ఆయనను నిలువునా కుంగదీసింది. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, తన పాలనాకాలపు వైఫల్యాలను కాంగ్రెస్ సర్కారు ఒక్కొక్కటే బయట పెట్టటం, ఎమ్మెల్యేలూ జారుకోవటం మొదలవటంతో కష్టకాలం మొదలైందనే లెక్కకొచ్చారు. ఈ సమయంలోనే వచ్చిన లోక్‌సభ ఎన్నికలకు టిక్కెట్లు తీసుకునేందుకు కూడా నేతలు ముందుకు రాకపోవటంతో ఆయన గతంలో దర్శనం ఇవ్వటానికే ఇష్టపడని నేతలకు టికెట్ ఇవ్వాల్సి వచ్చింది. టిక్కెట్లైతే ఇచ్చారు గానీ, గెలవటం ఎలా అనే సమస్య వచ్చింది. దీంతో ఉద్యమకాలం నాటి పాత వ్యూహాలకు పదును పెట్టారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేయబోతున్నారనే ముచ్చటను ముందుకు తీసుకొచ్చారు కేటీఆర్.అయితే దీనిని జనం అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఎందుకంటే గతంలో ఇలాంటి అనేక వ్యూహాలను గులాబీ పార్టీ తెరమీదికి తీసుకొచ్చిన సంగతి ఇంకా జనం మరచి పోలేదు కాబట్టే. గత నవంబరులో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు కొన్ని గంటల ముందు ఏపీ పోలీసులు హడావుడిగా నాగార్జున సాగర్ మీదికి రావటం, తెలంగాణ పోలీసులు వారిని అడ్డుకునే యత్నం చేయటం జరిగింది. అదే సమయంలో తెలంగాణలోని వైసీపీ నేతలు మీడియా ముందుకొచ్చి హైదరాబాద్‌ను యూటీగా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ వెంటనే హడావుడిగా గులాబీ నేతలంతా మీడియా ముందుకొచ్చి, తెలంగాణ నీటి వనరులు కాపాడలన్నా, హైదరాబాద్ ఎప్పటికీ తెలంగాణలోనే ఉండాలన్నా.. ప్రజలు తిరిగి తమకే ఓటేయాలని కోరటం జరిగింది. అయితే, ఈ సెంటిమెంట్ వర్కవుట్ కాలేదు. ఇటీవల తెలంగాణలో బస్సు యాత్ర సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ, ఇదే రాజకీయ వాతావరణం కొనసాగితే 'గోదావరిని మోదీ ఎత్కపోతరు' అనే కొత్త మాట మాట్లాడారు. గోదావరిని ఎత్కపోవడం ఏమిటో కానీ.. తాను సీఎంగా లేకపోతే తెలంగాణకు గుక్కెడు మంచినీళ్లు కూడా దొరకవని ఎమోషనల్ బ్లాక్ మెయిలింగ్‌కు దిగారు. తద్వారా ఈ నాలుగు నెలల్లోనే ఇన్ని సమస్యలు వస్తే, ఐదేళ్ల నాటికి జనం సమస్యలతో అల్లాడి పోతారని కేసీఆర్ చెప్పకనే చెప్పారు.మొత్తంగా చెప్పాలంటే.. తాము అధికారంలో ఉన్నప్పుడు అంతా స్వర్గం.. ఇతరులు ఉంటే అంతా నరకం అనేదే వీరు జనానికి చెప్పాలనుకుంటున్నారు. అందుకోసమే, హైదరాబాద్ యూటీ డ్రామాను మరోసారి తీసుకొచ్చారు. ఇక్కడ మరో ట్విస్ట్ ఏమిటంటే.. ఈ లోక్‌సభ ఎన్నికల్లో 12 సీట్లు తమకు ఇస్తే, హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం కాకుండా ఆపుతామనే భరోసా ఇవ్వటం. ప్రస్తుత ఎన్నికల్లో ఒక్కసీటూ దక్కే పరిస్థితి లేదని గ్రహించే కేటీఆర్ ఈ కొత్త మైండ్ గేమ్ ఆడుతున్నారని, ఇది పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడి ఎన్నికల స్టంట్ అంటున్నారు కాంగ్రెస్ నేతలు. బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఏపీలో 7 మండలాలను కలిపినప్పుడే ఎందుకు పోరాటం చేయలేదని వారు నిలదీస్తున్నారు. అలాగే 'సార్వత్రిక ఎన్నికల తరువాత రాష్ట్ర రాజకీయాలలో పెనుమార్పులు' అని కేసీఆర్ చెబుతున్న మాటలకు అర్థం ఆయన ఎన్డీయేలో కలవబోవటమేనని హస్తం నేతలు చెబుతున్నారు. మొత్తం మీద లోక్ సభ ఎన్నికలలో జీరో సీట్లకు పరిమితం కాకుండే ఉండేందుకు కేసీఆర్, కేటీఆర్ కలసి బీజేపీతో చేతులు కలపడానికీ, తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టడానికీ కూడా వెనుకాడటం లేదని వారు మండిపడుతున్నారు.



# ఓటు హక్కును వినియోగించుకున్న ప్రజలు

- ఉమ్మడి శామిర్ పేట మండలంలో ప్రశాంతంగా ముగిసిన పార్లమెంట్ ఎన్నికలు
- ఎన్నికలు సజావుగా జరిగాయి - ఎన్నికల అధికారులు

✍ జయభేరి, మే 13:

పార్లమెంట్ ఎన్నికలు ఉమ్మడి శామీర్ పేట్ మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం నుంచి ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూలైన్ లలో ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక తుంకుంట మున్సిపాలిటీ లో 59.58 శాతం పోలింగ్ నమోదు అయినట్లు కమిషనర్ వెంకట గోపాల్ వెల్లడించారు. ఇక శామీర్ పేట్ మండలంలో 67. 28 శాతం పోలింగ్ నమోదు అయిందని తహసీల్దార్ పి. యాదగిరి రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా మూడు చింతలపల్లి మండలం లో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, మొత్తం 82.20 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్ వెంకట నర్సింహా రెడ్డి వెల్లడించారు.

# ఓటర్లకు కల్పించిన సదుపాయాలపై ఆరా

- శామిర్ పేట మండలంలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఎన్నికల పరిశీలన అధికారి ప్రియాంక శుక్ల



✍ జయభేరి, మే 13:

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం లోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలన అధికారి ప్రియాంక శుక్ల తనిఖీ చేశారు.మండలంలోని మజిద్ పూర్, మురహరిపల్లి, లాల్ గడి మలక్ పేట్ లోని పోలింగ్ కేంద్రాల ను సందర్శించిన అనంతరం పోలింగ్ సరళిని అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఓటర్లకు కల్పించిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేసిన సిబ్బందిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి రెడ్డి, ఆర్ ఐ కుమార్, బిఎల్ఓ లు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.



# విద్యుత్ సమస్యను సత్వర పరిష్కారం చూపిన విద్యుత్ శాఖ సిబ్బంది



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలోని అక్సా మస్జీద్ చిన్న దర్గా ఎదురుగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్ సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు అకస్మాత్తుగా మంటలు చెలరేగి ట్రాన్స్ ఫార్మర్ పూర్తిగా దగ్ధం అయ్యింది. ఎటువంటి నష్టం జరగకుండా వెంటనే ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను ఆర్పి వేశారు.నిఘా వర్గాల సమాచారంతో విద్యుత్ అధికారులు మరియూ సిబ్బంది వెంటనే స్పందించి నూతన ట్రాన్స్ ఫార్మర్ మరియు కాలిపోయిన విద్యుత్ తీగలను చోట నూతన తీగలతో విద్యుత్ కి ఎటువంటి అంతరాయం లేకుండా ప్రజా సమస్యను వెంటనే సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# శిశువుకు మొదటిసారి స్నానం చేయించేటప్పుడు..

పుట్టిన తర్వాత బిడ్డకు మొదటిసారి స్నానం చేయించేటప్పుడు కొన్ని విషయాలు గుర్తుంచుకోవాలి. చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

బిడ్డకు మొదటిసారి స్నానం చేయించేప్పుడు గుర్తుంచుకోవాల్సిన విషయాలు బిడ్డకు మొదటిసారి స్నానం చేయించేప్పుడు గుర్తుంచుకోవాల్సిన విషయాలు మాతృత్వం గొప్పది.. కానీ బిడ్డ పుడితే తల్లుల బాధ చిన్నది కాదు. చాలా ఇబ్బం దులు ఎదుర్కొంటారు. చాలా మంది తల్లులు మొదటిసారి తమ బిడ్డకు ఎలా స్నానం చేయించాలో తెలియక కంగారు పడతారు. నిజానికి ప్రెగ్నెన్సీ నుంచి ఆందోళన మొదలై మీకు బిడ్డ పుట్టాక రెట్టింపు అవుతుంది. శిశువు మొదటి స్నానం అందులో ముఖ్యమైనది. ఇది శిశువు, తల్లిదండ్రులకు కొత్త అనుభవా లను తెచ్చే ప్రత్యేక క్షణం. మొదటి స్నానం శిశువు జీవితంలో ఒక ముఖ్యమైన అంశం. గతంలో అమ్మమ్మలు పాపకు స్నానం చేయించేవారు. కానీ నేటి తల్లి దండ్రులు తమ బిడ్డకు స్నానం చేయించే విషయంలో భయపడుతున్నారు. మీ శిశువుకు సురక్షితమైన, ఆనందదాయకమైన స్నానపు అనుభవాన్ని అందించ డానికి గుర్తుంచుకోవలసిన కొన్ని విషయాలు ఉన్నాయి.

శిశువు ఎక్కువగా ఆసుపత్రిలో పుడుతుంది. ఇతర ఆరోగ్య సమస్యలు లేని శిశువులు సాధారణంగా పుట్టిన గంట లేదా రెండు గంటలలోపు ఆసుపత్రిలో స్నానం చేస్తారు. అనేక సంస్థలు గత కొన్ని సంవత్సరాలుగా శిశువు యొక్క మొదటి స్నానం సమయాన్ని, విధానాలను వేరుగా చెబుతున్నాయి. బొడ్డు తాడులో కొంత భాగం పడిపోయిన తర్వాత మాత్రమే శిశువుకు మొదటిసా రి స్నానం చేయాలని చాలా మంది అంటున్నారు. ఇది సాధారణంగా పుట్టిన తర్వాత రెండు వారాలు పడుతుంది. అప్పటి వరకు మీరు స్పాంజితో శిశువును తుడవవచ్చు. డైపర్ ప్రాంతం, ముఖం, మెడ, చేతులను సున్నితంగా శుభ్రం చేయవచ్చు. మరికొన్ని చిట్కాలు పాటించాలి. శిశువు మొదటి స్నానం కోసం కొద్దిగా వెచ్చని సౌకర్యవంతమైన వాతావరణాన్ని సిద్ధం చేయాలి. స్నానం చేసిన తర్వాత శిశువు చల్లగా ఉండకుండా గది వెచ్చగా ఉండేలా చూసుకోండి.

డిమ్ లైట్లు, మంచి సంగీతాన్ని గదిలో వినిపించేలా చేయాలి. పాపతో మెల్లగా మాట్లాడి భద్రత కల్పించడం మంచిది. స్నానం చేసేటప్పుడు శిశువు మెడ, తలకు మద్దతు ఇవ్వడం చాలా ముఖ్యం. ఒక చేత్తో శిశువు తల, మెడకు సపోర్టు చేసి, మరో చేత్తో శరీరాన్ని మెల్లగా కడగాలి. తల, మెడను కొద్దిగా ఎత్తుగా ఉంచడం మంచిది. అనుకోకుండా కూడా వారి ముఖాలు నీటిలో మునిగిపోకుం డా ఉండేందుకు ఇలా చేయాలి. మీ బిడ్డ సున్నితమైన చర్మాన్ని కలిగి ఉంటారు. సువాసన ఎక్కువగా లేని శిశువు సబ్బు, మృదువైన వస్త్రాలను ఉపయోగించం డి. మృదువైన, శుభ్రమైన గుడ్డతో కళ్ళను సున్నితంగా తుడవాలి. ఆ తర్వాత ముఖం, మెడ, చెవులు శుభ్రం చేసుకోవాలి. ముఖం కింద, డైపర్ ప్రాంతంలో శుభ్రం చేసేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండండి.

స్నానం చేసిన తర్వాత, చర్మం మడతలు, డైపర్ ప్రాంతాలను మృదువైన టవల్ తో తుడవండి. కావాలనుకుంటే, చర్మాన్ని తేమగా మార్చడానికి తేలికపాటి, హైపోఅలెర్జెనిక్ బేబీ లోషన్ లేదా నూనెను వర్తించండి. శిశువుల చర్మం సు న్నితంగా ఉంటుంది. రసాయనాలు లేదా సువాసనలతో కూడిన ఉత్పత్తులను నివారించండి. తల్లితో అందమైన బంధాన్ని ఏర్పరచుకోవడానికి బేబీ మొదటి స్నానం ఉత్తమ అవకాశం. స్నానం చేస్తున్నప్పుడు శిశువును కంటిలోకి చూస్తూ మృదు స్వరంతో మాట్లాడండి. ఇది శిశువుకు భద్రత, బలాన్ని ఇస్తుంది. ఇది మీకు, మీ బిడ్డకు మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి కూడా సహాయపడు తుంది. సురక్షితమైన వాతావరణాన్ని నిర్ధారించడం, మీ బిడ్డను ప్రేమ, శ్రద్ధతో స్నానం చేయించడం ద్వారా మంచి క్షణాలను సృష్టించవచ్చు.





నెలన్నర రోజులుగా క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగిస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్17) కీలక దశకు చేరుకుంది. లీగ్ స్టేజీలో ఏడు మ్యాచ్‌లే మిగిలున్న ఈ టోర్నీలో ఇప్పటివరకు కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) మాత్రమే అధికారికంగా ప్లేఆఫ్ బెర్తును ఖరారుచేసుకుంది. మిగిలిన మూడు స్థానాల కోసం ఏకంగా ఆరు జట్లు రేసులో ఉన్నాయి. నాకౌట్ దశకు చేరే ఆ మూడు జట్లపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# రేసు రసవత్తరం!

ఏడు మ్యాచ్‌లు.. ఆరు జట్లు.. మూడు బెర్తులు..! ఐపీఎల్ 17లో సోమవారం కోల్‌కతా నైట్ రైడర్స్‌గుజరాత్ టైటాన్స్ (జీటీ) మ్యాచ్ రద్దు అయ్యేసరికి ఉన్న సమీకరణం. అహ్మదాబాద్‌లో వర్షం కారణంగా కేకేఆర్‌జీటీ మ్యాచ్ రద్దవడంతో ప్లేఆఫ్స్ రేసు నుంచి గుజరాత్ అధికారికంగా నిష్క్రమించినా రాజస్థాన్, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, లక్నో ఇంకా పోటీలోనే ఉన్నాయి. మరి టాప్4లో నిలవాలంటే ఏ జట్టుకు అవకాశాలున్నాయి..? ఆరింటిలో ప్లేఆఫ్స్ వెళ్లే ఆ మూడు జట్లు ఏవి..?

**రాజస్థాన్ రాయల్స్..**

సీజన్ ఆరంభంలో వరుస విజయాలతో అందరి కంటే ముందే ప్లేఆఫ్స్ బెర్తు దక్కించుకుంటుందను కున్న రాజస్థాన్ రెండో దశ నుంచి తడబడుతోంది. అయినా పాయింట్ల పట్టికలో 16 పాయింట్లతో ఆ జట్టు రెండో స్థానంలో ఉంది. నెట్ రన్ రేట్ (+0.349) కూడా మెరుగ్గానే ఉంది. శాంసన్ సేనకు మరో రెండు మ్యాచ్‌లు మిగిలున్నాయి. నేడు (మంగళవారం) ఢిల్లీలక్నో మధ్య జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ గెలిస్తే రాజస్థాన్ బెర్తును ఖాయం చేసుకున్నట్టే. ఒకవేళ లక్నో గెలిచినా రాయల్స్ తర్వాతి రెండు మ్యాచ్‌లలో ఒకటి నెగ్గితే ఆ జట్టు నాకౌట్ దశకు చేరుతుంది.

**చెన్నై సూపర్ కింగ్స్..**

రెండ్రోజుల క్రితం రాజస్థాన్‌తో మ్యాచ్ గెలవడం చెన్నై ఆశలను సజీవంగా ఉంచింది. ఏడు విజయాలు 14 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్న సీఎస్‌కే.. +0.528 రన్‌రేట్ తో మెరుగైన స్థానంలోనే ఉంది. ఆ జట్టు చివరి లీగ్ మ్యాచ్‌ను ఈనెల 18న బెంగళూరుతో ఆడాల్సి ఉంది. ఈ పోరులో నెగ్గితే సీఎస్‌కే ఖాతాలో 16 పాయింట్లు చేరతాయి. ఒకవేళ ఓడినా హైదరాబాద్, లక్నో జట్లు తమ తదుపరి మ్యాచ్‌లలో ఓడితే ప్లేఆఫ్స్ చేరే అవకాశముంటుంది.

**సన్‌రైజర్స్ హైదరాబాద్..**

ఉప్పల్‌లో లక్నోపై భారీ విజయం హైదరాబా ద్‌కు కలిసొచ్చింది. ఎస్ఆర్‌హెచ్ ఖాతాలో 14 పాయింట్లు ఉండగా ఆ జట్టు మరో 2 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ రెండింటిలో ఒక్కటి గెలిచినా హైదరాబాద్ టాప్4లో నిలుస్తుంది. రెండూ గెలిస్తే టాప్2కు వెళ్లే అవకాశం లేకపోలేదు. అలాకా కుండా రెండు మ్యాచ్‌లలో ఓడితే మాత్రం చెన్నై, బెంగళూరు (సీఎస్‌కేపై గెలిస్తే), లక్నో.. ఎస్ఆర్‌హె చ్‌ను అధిగమించే ప్రమాదమూ పొంచిఉంది.

**రాయల్ చాలెంజర్స్ బెంగళూరు..**

ఈ సీజన్ తొలి దశలో వరుసగా ఆరు మ్యాచ్‌లు ఓడి అసలు అందరికంటే ముందే బిస్తరు సర్దే స్తుందనుకున్న ఆర్సీబీ అనూహ్యంగా ప్లేఆఫ్స్ రేసులోకి దూసుకురావడం ఆశ్చర్యమే. వరుసగా ఐదు విజయాలతో 12 పాయింట్లు ఖాతలో ఉన్న బెంగళూరు.. 18న సొంతగడ్డపై చెన్నైని ఢీకొనాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో బెంగళూరు మొదట బ్యాటింగ్ చేస్తే చెన్నైని 18 పరుగుల తేడాతో ఓడించాలి. ఒకవేళ ఛేదనకు దిగాల్సి వస్తే లక్ష్యాన్ని 18.1 ఓవర్ల లో పూర్తి చేయాల్సి ఉంటుంది. అప్పుడు మెరుగైన రన్‌రేట్‌తో ఆర్సీబీ సైతం ప్లేఆఫ్స్ రేసులోకి వస్తుంది. అయితే అంతకంటే ముందే.. హైదరాబాద్, లక్నో తాము తర్వాత ఆడబోయే మ్యాచ్‌లలో గెలిస్తే బెంగ ళూరుకు మరోసారి వామహస్తమే.

**ఢిల్లీ క్యాపిటల్స్..**

బెంగళూరు చేతిలో ఓటమి ఢిల్లీని దారుణంగా దెబ్బతీసింది. అనధికారికంగా ఆ జట్టు టాప్4 రేసులో లేకున్నా.. లక్నోతో మ్యాచ్‌లో గెలిచి లక్నో, హైదరాబాద్ తమ మిగిలిగిన మ్యాచ్‌లలో ఓడితే అప్పుడు ఢిల్లీకి అవకాశముంటుంది.

**లక్నో సూపర్ జెయింట్స్..**

హైదరాబాద్‌తో పరాజయం లక్నో ప్లేఆఫ్స్ అవ కాశాలకు అడ్డుకట్ట వేసింది. పాయింట్ల పట్టికలో ఏడో స్థానం (12 పాయింట్లు)లో ఉన్న రాహుల్ సేన.. మరో రెండు మ్యాచ్‌లలో గెలిస్తే 16 పాయిం ట్లకు చేరుతుంది. అది కూడా భారీ తేడాతో గెలిచి నెట్ రన్ రేట్ (ప్రస్తుతం 0.769) మెరుగుపరుచు కోవాలి. అదే సమయంలో హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ మ్యాచ్‌లలో పరాభవాలు ఎదుర్కొంటే లక్నోకు ఛాన్స్ ఉంటుంది.



# ఖాళీ కడుపుతో ఈ 5 ఆహారాలు తినకండి..

ఉదయంపూట మనం తీసుకునే ఆహారం మంచిదై ఉండాలి. లేదంటే ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఖాళీ కడుపుతో తీసుకోకూడని కొన్ని ఆహారాలు ఉన్నాయి.

పొద్దున్నే నిద్ర లేవగానే పళ్లు తోముకున్న వెంటనే ఏదైనా తినాలనే కోరిక కలుగుతుంది. దీని తర్వాత చాలా మంది టీ లేదా కాఫీ తాగుతారు. కానీ ఈ పద్ధతి చాలా తప్పు. ఎందుకంటే ఇది పొట్టలో ఎసిడిటీని పెంచుతుంది. ఇది అనేక కడుపు సంబంధిత సమస్యలను కలిగిస్తుంది. జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. ఇది కాలేయంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. నిజానికి రాత్రిపూట ప్రశాంతంగా నిద్రపోతున్నప్పు డు మన పొట్టలో హైడ్రోక్లోరిక్ యాసిడ్ పరిమాణం పెరుగుతుంది. అయితే ఎసిడిక్ ఫుడ్స్ తింటే పొట్టలో యాసిడ్ పరిమాణం పెరుగుతుంది. దీని వల్ల మన శరీరంలో అనేక రకాల అనారోగ్యాలు వస్తాయి. అందుకే పొట్ట సమస్యలు రాకుండా ఉండాలంటే ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినకూడ ని ఆహారాలు ఏమిటో తెలుసుకోవాలి. మీరు దీని గురించి కచ్చితంగా తెలుసుకోవాలి.

చాలా మంది ఉదయం పూట ముందుగా పండ్ల రసాన్ని తాగుతారు. ఇది చాలా తప్పు మార్గం. ఉదయాన్నే పండ్ల రసం లేదా స్వీట్లు తినడం వల్ల కడుపులో యాసిడ్ ఉత్పత్తి పెరుగుతుంది. ఈ సమస్య పొత్తికడుపు నొప్పి, అదనపు గ్యాస్ కలిగిస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల కాలేయం, ప్యాంక్రియాస్‌పై భారం పెరుగుతుంది. సుదీర్ఘ రాత్రి విశ్రాంతి తర్వాత, ప్యాంక్రియాస్ ఉదయం పని చేయడం ప్రారంభిస్తుంది. ఉదయం తీపి పానీయాలు తాగడం వల్ల దాని భారం పెరుగు తుంది. ఇది దాని పనితీరును ప్రభావితం చేస్తుంది. అందుకే ఉదయం పూట ముందుగా స్వీట్లు లేదా ప్రాసెస్ చేసిన ఆహారాలు తినకూడదు. ఇవన్నీ కాలేయంపై అదనపు భారాన్ని మోపుతాయి. ఉదయం పూట నీటిని తాగండి.

చాలా మంది టీ లేదా కాఫీతో తమ రోజును ప్రా రంభిస్తారు. కానీ టీ, కాఫీ వంటివి ఉదయం పూట ఖాళీ కడుపుతో తీసుకోకూడదు. కాఫీలో కెఫీన్ ఎక్కువగా ఉంటుంది. ఇది కడుపులో హైడ్రోక్లోరిక్ యాసిడ్ మొత్తాన్ని పెంచుతుంది. ఎందుకంటే ఉదయం పూట కడుపులో హైడ్రోక్లోరిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటుంది. అందుకే కాఫీ తాగిన తర్వాత దాని పరిమాణం మరింత పెరగదు. ఇది కడుపు నొప్పిని కలిగిస్తుంది. రోజంతా కడుపు బరువుగా, ఉబ్బినట్లు అనిపిస్తుంది. ఇది అసిడిక్, పొట్టకు ఎక్కువ పనిని ఇస్తుంది. టీలో తక్కువ మొత్తంలో కెఫిన్, టానిన్లు ఉంటాయి. ఇది కడుపులో గ్యాస్‌కు కారణమవుతుంది.

సిట్రస్ పండ్లలో ఆమ్లత్వం కలిగిన విటమిన్ సి ఉంటుంది. వీటిలో నిమ్మకాయలు, నారింజ, ద్రాక్షపండ్లు మొదలైనవి ఉన్నాయి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఆరెంజ్ తింటే, కడుపులో ఎక్కువ యాసిడ్ ఉత్పత్తి అవుతుంది. దీనివల్ల కడుపు ఉబ్బరం, కడుపు ఉబ్బరం ఏర్పడుతుంది. పండ్లను ఉదయాన్నే ఎక్కువగా తినడం వల్ల రోజంతా ఆకలిగా అనిపించకుండా ఉంటుంది. ఎందుకంటే వాటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. మరోవైపు, గ్యాస్, అజీర్ణం కారణంగా రోజంతా తీవ్రమవుతుంది.

ఉదయం పూట ఖాళీ కడుపుతో స్పైసీ ఫుడ్ తినడం వల్ల పొట్టలో ఎక్కువ యాసిడ్ ఉత్పత్తి అవుతుంది. స్పైసీ ఫుడ్‌లోని యాసిడ్ పేగులపై గీతలు పడటం ప్రారంభిస్తుంది. ఇది కాలేయం, మూత్రపిండాలపై కూడా ప్రభావం చూపుతుంది. దీనితో పాటు స్పైసీ ఫుడ్స్ కూడా ఎసిడిటీని పెంచుతాయి.

ఉదయాన్నే ఖాళీ కడుపుతో టమోటాలు తినవ ద్దు. టమోటాలు కూడా ఆమ్లంగా ఉంటాయి. టొమాటోలో ఉండే నీరంతా ఆక్సాలిక్ యాసిడ్. టమోటాలలో 10 కంటే ఎక్కువ ఆమ్లాలు కనిపి స్తాయి. వీటిలో సిట్రిక్ యాసిడ్, మాలిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటాయి. అందుకే ఖాళీ కడుపుతో టొమాటోలు తింటే పొట్టలో ఆమ్లం పెరుగుతుంది. ఉదయం నిద్ర లేవగానే ముందుగా నీళ్లు తాగాలి. అప్పుడు ఏదైనా తినండి.

# మూవీభేరి



# తారా దిగి వచ్చిందా..?

ఛలో, గీతగోవిందం సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది కన్నడ సోయగం రష్మిక మందన్నా. ఈ నేషనల్ క్రష్ సోషల్ మీడియాలో ఏదైనా పోస్ట్ పెట్టిందంటే చాలు కామెంట్స్, లైక్స్ వర్షంలా కురుస్తుంటాయి. ఈ భామ తాజాగా Travel+Leisure ట్రావెల్ మ్యాగజైన్ కోసం ఫొటోషూట్‌లో పాల్గొన్నది. మీగన్ కాన్సెస్సియో డిజైన్ చేసిన కాస్ట్యూమ్స్‌లో హొయలు పోయింది.

ఆస్ట్రేలియా ప్రకృతి సోయగాల నడుమ పసుపు బ్రాలెట్‌స్‌లో పర్‌ఫెక్ట్ సమ్మర్ ఔట్‌ఫిట్‌లో దివి నుండి తారక దిగి వచ్చిందా..? అన్నట్టుగా కనిపిస్తూ నెట్టింట సెగలు రేపుతోంది. ట్రావెల్ మ్యాగజైన్ ఫొటోషూట్ స్టిల్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. ఈ భామ బాలీవుడ్ స్టార్ హీరో రణ్ బీర్ కపూర్‌తో కలిసి నటించిన యానిమల్ బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది.

రష్మిక ఇప్పటికే ఇదే మ్యాగజైన్ కోసం అనైటా ష్రాఫ్ డిజైనింగ్ బ్లాక్ బికినీ వేర్‌లో బీచ్‌లో హాట్ హాట్ ఫోజులిచ్చిందని తెలిసిందే. రష్మిక తన టీంతో కలిసి అబుదాబిలోని సెయింట్ రెజిస్ సాడియత్ ఐలాండ్ బీచ్‌కు వెళ్లగా.. ఈ ఫొటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. రష్మిక ప్రస్తుతం అల్లు అర్జున్‌సుకుమార్ కాంబినేషన్‌లో పుష్పకు కొనసాగింపుగా వస్తున్న పుష్ప..ది రూల్ సినిమాలో నటిస్తోంది. దీంతోపాటు రాహుల్ రవీంద్రన్ డైరెక్ట్ చేస్తున్న ది గర్ల్ ఫ్రెండ్ చిత్రంలో నటిస్తోంది.

ఇటీవలే మురుగదాస్, సల్మాన్ ఖాన్ కాంబినేషన్‌లో రాబోతున్న సికిందర్‌లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ఓ అప్‌డేట్ కూడా వచ్చింది.



# ఓటింగ్‌లో తారలు..

సోమవారం జరిగిన తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో పలువురు సినీ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి తన భార్య సురేఖ, కుమార్తెతో కలిసి జూబ్లీహిల్స్ క్లబ్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. అగ్ర దర్శకుడు రాజమౌళి.. భార్య రమా రాజమౌళి, కుమారుడు కార్తికేయతో కలిసి షేక్‌పేటలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. 'దుబాయ్ నుంచి హైదరాబాద్ చేరుకొని నేరుగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశాను' అని రాజమౌళి ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నారు. వీరితో పాటు అగ్ర హీరోలు మోహన్‌బాబు, మహేష్‌బాబు, ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్‌చరణ్, మంచు విష్ణు, నాగచైతన్య, కల్యాణ్‌రామ్ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతూ ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తారలందరూ సోషల్‌మీడియా వేదికగా సందేశాలను అందించారు. సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు జూబ్లీ హిల్‌స్‌లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. వృద్ధాప్యం కారణంగా నడవలేని స్థితిలో ఉన్నప్పటికీ కేర్ టేకర్ సాయంతో పోలింగ్ కేంద్రానికి వచ్చిన కోట శ్రీనివాసరావు ఓటేసి.. ఓటు ప్రాధాన్యతను తెలియజేశారు. మరోవైపు నందమూరి కల్యాణ్ రామ్, సందీప్ కిషన్, ఆదిసాయికుమార్, అనన్యనాగళ్ల, అల్లు శిరీష్, కిరణ్ అబ్బరవరం, మంచు మోహన్ బాబు, మనోజ్, విష్ణు, అక్కినేని నాగచైతన్య తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.





# ప్రచారానికి సిద్ధం!

## కల్కి 2898 ఏడీ

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న సైన్స్ ఫిక్షన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ' నిర్మాణ దశ నుంచే పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. భారతీయ పౌరాణిక ఇతిహాసాల స్ఫూర్తితో ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికాపడుకోన్ వంటి అగ్ర తారలు ఈ సినిమాలో భాగం కావడంతో దేశ వ్యాప్తంగా క్రేజ్ ఏర్పడింది. ఈ చిత్రాన్ని జూన్ 27న విడుదల చేయబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించింది. మహాభారతకాలంలో మొదలయ్యే ఈ కథ దాదాపు ఆరువేల సంవత్సరాల వ్యవధిలో నడుస్తుంది. విడుదల తేది దగ్గరపడుతుండటంతో ఈ సినిమా ప్రమోషన్స్‌ను వినూత్న రీతిలో నిర్వహించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. మైథాలజీ, సైన్స్ అంశాల కలబోతగా పాన్ వరల్డ్ కథాంశం కావడంతో ప్రేక్షకులందరికీ సినిమా రీచ్ అయ్యేలా భారీ స్థాయిలో ప్రచారం చేయబోతున్నారని సమాచారం. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com